మాజీ మంత్రి మహమూద్ అలీ అరెస్ట్

చాదర్‌ఘాట్: బీఆర్‌ఎస్ పార్టీ తలపెట్టిన చలో బస్‌భవన్ కార్యక్రమంలో భాగంగా మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, గ్రేటర్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆజమ్‌అలీని గురువారం ఉదయం అజంపురాలో చాదర్‌ఘాట్ పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ ఆర్టీసీ చార్జీలకు పెంపునకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ తలపెట్టిన చలో బస్‌భవన్ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు నిర్బంధించం ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేయటమేనన్నారు.

డివిజన్ అభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్డు పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ మధుసూధన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి అన్నారు. గురువారం చంపాపేట డివిజన్ పరిధిలోని దుర్గాభవానీనగర్ కాలనీలో రూ 37 లక్షలతో తలపెట్టిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన, మారుతీనగర్ కాలనీలో రూ. 9.50లక్షల నిధులతో పూర్తిఅయిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాసనాయుడు, సుమిత్‌సింగ్, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారులు గుంతలమయం



మలక్‌పేట: మూసారంబాగ్ సలీంనగర్‌లో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. డ్రైనేజీ లీకేజీలతో బీటీ రోడ్డు దెబ్బతింటోంది. ఇటీవల కురిసిన వానలకు రోడ్లు గుంతలమయమైన రోడ్లు వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. డ్రైనేజీ పైపులైన్ల కోసం ఎలాంటి అనుమతులు లేకండా సీసీ, బీటీ రోడ్లు తవ్వేస్తున్నారు. పనులు పూర్తి అయిన తరువాత సరిగా పూడ్చకపోవడంతో రోడ్లకు గండి పడి రాకపోకలకు కొనసాగించడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శాలివాహననగర్, సలీంనగర్ ప్రాంతాలలో లక్షలు పోసి నిర్మించిన రోడ్లు నిర్లక్ష్యం కారణంగా పూర్తిగా దెబ్బతింటున్నాయి. అధికారులు రోడ్లకు మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రగతి చక్ర పురస్కారాలు ప్రదానం



ప్రగతి చక్ర పురస్కారాలు అందజేస్తున్న ఆర్ఎం సుధా పరిమళ, డీఎం సమత

చైతన్యపురి: ఉత్తమ సిబ్బందికి ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగ డిపోలో ప్రగతి చక్ర పురస్కారాలు అందజేశారు. సెప్టెంబర్ మాసానికి గాను బెస్ట్ కేఎంపీఎల్ ఇందన పొదుపు చేసిన డ్రైవర్లు అయిదుగురు , బెస్ట్ ఈపీకె సాధించిన ఆరుగురు కండక్టర్లకు గురుపరం డిపోలో జరిగిన కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ సుధా పరిమళ చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సమత, అసిస్టెంట్ మేనేజర్, మెకానికల్ ఫోర్‌మెన్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: పార్టీలకతీతంగా ప్రజల అభివృద్ధే తమ లక్ష్యమని ఆర్టీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. గురువారం కొత్తపేట డివిజన్ ఆర్టీసీ కాలనీలో రూ. 75 లక్షల నిధులతో చేపట్టిన రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీ ప్రజలు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రోడ్ల సమస్యకు ఇప్పుడు పూర్తి పరిష్కారం లభించనుందని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే మా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు పెంటా రెడ్డి పాల్గొన్నారు.

వామ్మో...‘వాంబే’

శిథిలావస్థలో సింగరేణి వాంబే గృహాలు

- డ్రైనేజీలు ధ్వంసం.. పారిశుద్ధ్యం అస్తవ్యస్తం
- ఇబ్బందులు పడుతున్న నివాసితులు
- తక్షణ మరమ్మతులకై వినతి

సైదాబాద్: నగరంలోనే అతి పెద్ద మురికివాడలలో ఒకటైన సింగరేణి కాలనీలో నివసించే అందరూ నిరుపేదలే. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని ఈ సింగరేణి కాలనీలో ఉండే వారు నిత్యం కూలీ పనులు, ఆటోలు నడుపుతూ, చెత్త సేకరించే వాహనాలు, చిన్నాచితక పనులు చేసుకుంటూ జీవించే వారే ఇక్కడ అధికంగా ఉంటారు. ఇక్కడ ఉన్న సుమారు 20 ఎకరాల భూమిలో గుడిసెవాసులు, 7 ఎకరాల స్థలంలో వాంబే గృహ సముదాయాలు ఉన్నాయి.



పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న క్వార్టర్స్‌లోని ఇళ్లు

20 సంవత్సరాల క్రితం నిర్మించిన వాంబే గృహాలలో అనేక సమస్యలతో ఇక్కడి నివాసితులు పలు ఇబ్బందులు పడుతున్నారు. పరిసర కాలనీల్లో ఫుట్‌పాత్ పనులకే లక్షల రూపాయలు వెచ్చిస్తున్న అధికారులు, నిరుపేదలు నివసించే సింగరేణి వాంబే గృహాలలో కనీసం మౌళిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీస మరమ్మతులు కూడా కరువే...

20 సంవత్సరాల క్రితం నిర్మించిన ఇక్కడి గృహాలకు ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి మరమ్మతు పనులు చేయించక పోవడం శోచనీయం. గృహాలలో పెచ్చులు ఊడి పడుతున్నాయని, ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందో అని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గృహాలలోనే కాకుండా బిల్డింగ్‌లోని కామన్ ఏరియాల్లో, మెట్లు ఉన్న ప్రాంతాలలో చాలా చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయని, వాటికి మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం...

సింగరేణి కాలనీకి చుట్టుపక్కల ఉన్న యాకత్‌పురా, మలక్‌పేట, ఎల్బీనగర్, మహేశ్వరం నియోజకవర్గాలలోని పలు కాలనీల్లో ఇంటింటికి చెత్త సేకరించే వాహనాలు నిర్వహించేవారు సింగరేణి కాలనీలోనే ఉంటారు. కానీ ఇక్కడి వాంబే గృహాల నుంచి చెత్త సేకరణ వ్యవస్థే లేకపోవటం గమనార్హం. కేవలం రెండు చెత్త సేకరించే వాహనాలను ఇక్కడి గృహాలకు కేటాయించినా ఇక్కడ పారిశుద్ధ్య సమస్య పరిష్కారమవుతుంది. కానీ ఆదిశగా అధికారులు గానీ, స్థానిక నాయకులు కానీ చర్యలు తీసుకోకపోవటం బాధాకరం. ఇంటింటికి చెత్త సేకరించే వారు లేక పోవటంతో అందరూ తమ ఇళ్లలోని చెత్తను బ్లాక్‌ల మధ్య పడేస్తున్నారు. దాంతో గృహ సముదాయాలు మురికి కూపంగా మారుతున్నాయి.



ఐఎస్‌సదన్‌లోని సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాలు

వైఎస్‌ఆర్ హయాంలో గృహాల నిర్మాణం...

సింగరేణి కాలనీలో మొత్తం గుడిసెవాసులు నివసిస్తున్న 2005లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పెద్ద సంఖ్యలో గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఘటనాస్థలిని ప్రత్యక్షంగా సందర్శించి బాధితులను చూసి చలించిపోయారు. గుడిసెలు కోల్పోయిన వారికి అదే స్థలంలో పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని అప్పటికప్పుడు వారికి హామీ ఇచ్చారు. అక్కడే ప్రభుత్వ హయాంలో వాంబే గృహ సముదాయాలను 2005లో ప్రారంభించి 2007లో నిర్మాణాలు పూర్తి చేసారు. 56 బ్లాకుల్లో నిర్మించిన బిల్డింగుల్లో 1792 ఇళ్లు నిర్మించి అప్పటి బాధితులకు ఆయన స్వయంగా అందజేశారు. అయితే ఆయన తరువాత వచ్చిన ప్రభుత్వాలు సింగరేణి కాలనీ పట్ల చిన్న చూపు చూడటంతో ఇక్కడి వాంబే గృహ సముదాయాలు సమస్యలకు నిలయంగా మారాయి.

రహదారులపై ధ్వంసమైన డ్రైనేజీలు...

సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్‌లో రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీలు చాలా వరకు ధ్వంసమయ్యాయి. క్వార్టర్స్‌లో ఎప్పుడూ ఎక్కడో ఒకచోట డ్రైనేజీలు పొంగి రహదారులపై మురుగు పారటం సర్వ సాధారణంగా మారింది. రహదారులపై పారుతున్న మురుగుతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు అంటున్నారు. పలు చోట్ల డ్రైనేజీలు పగిలి తాగునీటి పైప్ లైన్‌లతో కలిసి కలుషిత నీరు సరఫరా అవుతుందని నివాసితులు చెపుతున్నారు. అంతే కాకుండా పగిలిన డ్రైనేజీల నుండి క్రిమికీటకాలు, తేళ్లు, విషసర్పాలు బయటకు వచ్చి ఇళ్లలోకి వస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్‌లో అవసరమైన మరమ్మతు పనులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. కనీస మౌళిక వసతులు కల్పించడం ద్వారా తమ మెరుగైన జీవనానికి అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నిరుపేదల నివాసాలపై చిన్నచూపు తగదు



నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల వారు నివసించే సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్ నివాసాలపై అధికారులు చిన్నచూపు చూడటం తగదు. నియోజకవర్గంలో, డివిజన్‌లో అభివృద్ధి పనుల పేరిట కోట్ల రూపాయలు కేటాయిస్తున్న జిల్లా రెవిన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు సింగరేణి క్వార్టర్స్‌లో ప్రజలకు కనీస అవసరాలు కల్పించక పోవటం ఎంత వరకు సబబు. క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయాలని, మౌళిక వసతులు కల్పించాలని ఎన్ని సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం కనిపించటం లేదు. అధికారులు స్పందించక పోతే సింగరేణి క్వార్టర్స్‌లో నివసించే వారితో కలిసి పోరాటాలు చేస్తాం.

–షేక్ మహమూద్–ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి

సింగరేణి అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపిస్తాం



సింగరేణి కాలనీ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపిస్తున్నాం. ఇక్కడి వాంబే క్వార్టర్స్‌లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఇప్పటికే ఉన్నతాధికారులను కోరాం. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, కమిషనర్, జిల్లా కలెక్టర్‌లకు వినతిపత్రాలు సైతం సమర్పించాం. జిల్లా కలెక్టర్ సింగరేణి కాలనీలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అనుమతిస్తామని తెలిపారు. వాంబే క్వార్టర్స్‌లో మరమ్మతు పనులు, డ్రైనేజీలు, పైప్‌లైన్‌ల ఆధునీకరణకు త్వరలో ప్రణాళికలు రూపొందిస్తాం. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో మౌళిక వసతుల కల్పనకు మేము కట్టుబడి ఉన్నాం.

–జంగం శ్వేతామధుకర్‌రెడ్డి–ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలోల్లో..)

టమోటా రూ.21, వంకాయ రూ.35, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.21, క్యారెట్ రూ.50, దొండ రూ28, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.55, దోసకాయ రూ.18, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.23, మునగ రూ.55, కందగడ్డ రూ.40, బీట్‌రూట్ రూ.40, కీర రూ.23, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.55.

ఈరోజు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నాగోలులో 12 న పల్స్ పోలియో

నాగోలు: ఈనెల 12న నాగోలు డివిజన్ పరిధిలోని సాయినగర్‌లోని గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ డాక్టర్ సరస్వతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

ఫతుల్లా గూడ చెరువును కాపాడాలి

నాగోలు: బండ్లగూడ పరిధిలోని ఫత్తుల్లాగూడ గ్రామ చెరువులోకి పరిసర కాలనీల మురుగునీరు చేరితే చెరువు కాలుష్యానికి గురవుతోందని దీంతో చెరువులో డ్రైనేజీ నీడని కలపకుండా వేయాలని కోరుతూ ఈ సమస్యపై ఫత్తుల్లాగూడ యువజన సంఘం నాయకులు గురువారం నాగోలు ఇన్‌స్పెక్టర్ మక్బుల్ జానీ కలిసి ఫిర్యాదు అందజేశారు. దాదాపు 500 గృహాలు, నాలుగు పెద్ద అపార్ట్‌మెంట్ భవనాల నుంచి వచ్చే డ్రైనేజీ మురుగునీరు నేరుగా చెరువులోకి కలపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని దీంతో చెరువు పూర్తిగా మురికి మయంగా మారిపోయే ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాటేపాక రవికుమార్, కాటేపాక కిషన్, చందు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్ బకాయిలు చెల్లించాలి

హస్తినాపురం: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ , స్కాలర్‌షిప్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చలో హస్తినాపురం 48 గంటల నిరాహార దీక్ష కార్యక్రమాన్ని బీజేపి రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరేశ్ యాదవ్ తెలిపారు. ఈ దీక్షాకార్యక్రమం అక్టోబర్ 10 శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు హస్తినాపురం సెంట్రల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని వివిద కళాశాలల విద్యార్థులు , వారి తల్లిదండ్రులు , పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొనాలని నరేశ్‌యాదవ్ కోరారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి



న్యూనాగోలు కాలనీలో డ్రైనేజీ సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్..

నాగోలు: కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జలమండలి అధికారులు డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని న్యూ నాగోల్ రోడ్ నెంబర్ 1లో కొన్ని రోజులుగా తీవ్రంగా డ్రైనేజ్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న కార్పొరేటర్ గురువారం కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. స్థానిక కాలనీ వాసులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. వెంటనే జలమండలి అధికారులను సంప్రదించి, డ్రైనేజ్ సమస్యను తక్షణమే పరిష్కరించాల్సింది సూచించారు. న్యూ నాగోల్ సంక్షేమ సంఘం నాయకులు రామక్రిష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

కలగానే ‘ఇంటిగ్రేటెడ్’!

బడంగ్‌పేట్: ప్రజల సౌకర్యార్థం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. దీన్ని పట్టించుకునే వారే లేకపోవడంతో పిల్లర్ల దశలో ఆగిపోయిన నిర్మాణంలో ముళ్ల పొదలు పెరిగాయి. దావుత్‌ఖాన్‌గూడలో సర్వేనంబర్– 2లో ఉన్న రెండెకరాల ప్రభుత్వ స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారు. ఇందుకోసం రూ.4 కోట్లు వెచ్చించారు. ఈ క్రమంలో పిల్లర్లు పూర్తి చేసి, కొంత మేర స్లాబు వేశారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడం, ఎలక్షన్లు పూర్తవడం, ప్రభుత్వాలు మారిపోవడం చకచకా జరిగిపోయాయి. దీంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు రాజకీయ గ్రహణం పట్టుకుంది. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొత్త సర్కారు కొలువుదీరి రెండేళ్లు దాటినా నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంపై మండిపడుతున్నారు.

అన్నీ ఒకే చోట దొరికేలా..

కూరగాయలు, మాంసం, ఆకుకూరలు, పప్పు దినుసులు వగైరా అన్ని వస్తువులు ఒకేచోట దొరికేలా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టారు. కానీ పాలకుల నిర్లక్ష్యంతో ప్రజల ఆకాంక్ష నెరవేరడం లేదు. రాజకీయ పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం తప్ప నిర్మాణ పనులను పూర్తి చేయాలనే ఆలోచన ఎవరికీ లేకుండాపోయింది. పాలకులకే పట్టింపు లేదు తామెందుకు జోక్యం చేసుకోవాలని భావిస్తున్నారో.. ఏమో..? అధికారులు కూడా ఈ విషయాన్ని ప్రస్తావించడం లేదు. ఇప్పటికైనా మార్కెట్ భవనాన్ని పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



దావుత్‌ఖాన్‌గూడలో అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

ఉప్పల్ భగాయత్‌లో ఎమ్మెల్యే పర్యటన

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం పర్యటించారు. ఎస్‌టీపీ నిర్మాణానికి కేటాయించిన 4 ఎకరాల స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప్పల్‌హిల్స్, కురుమానగర్, లక్ష్మీ నారాయణ కాలనీవాసులు ఎస్‌టీపీ వల్ల కాలనీలకు దుర్వాసన వచ్చే ప్రమాదం ఉందని, ఇప్పటికే మూసీ నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని తమను మరో ప్రాంతానికి తరలించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారులకుతో మాట్లాడి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా బొడ్రాయి ఊరేగింపు



హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని బొడ్రాయి(నాభి శిల) ప్రతిష్టాపన ఉత్సవాలలో బాగంగా గురువారం రాత్రి బొడ్రాయిని ప్రజల దర్శనార్థం హయత్‌నగర్ గ్రామ వీధుల్లో ఊరేగించారు. డప్పుల దరువులు పటాసుల మోతలతో వైభవంగా ఊరేగించారు. వేల సంఖ్యలో ప్రజలు బొడ్రాయిని దర్శించుకోగా మహిళలు హారతులతో నీటి సాకలు నిర్వహించి స్వాగతం పలికారు. కార్పొరేటర్లు కళ్ళెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహ్మారెడ్డిలు ఊరేగింపు వెంట ఉండి పరిస్థితిని సమీక్షించారు.

చెట్టును నరికివేసిన వ్యక్తికి రూ. పదివేల జరిమానా

హస్తినాపురం: వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చైతన్య నగర్‌కాలనీలో ఏపుగా పెరిగిన రావిచెట్టును నరికేసిన జగదీశ్వర్‌రెడ్డి అనే వ్యక్తికి రూ. 10వేల జరిమానా విధించినట్లు ఇబ్రహీంపట్నం డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి కస్నా తెలిపారు. ఈ నెల 6న రాత్రి సమయంలో చెట్టు ను నరికివేయించిన ప్లాట్ యజమానిపై ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లను పెంచాల్సింది పోయి పెరిగిన చెట్లను నరికివేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కస్నా హెచ్చరించారు. కాలనీలలో పెరిగిన చెట్లను ఎవరైనా నరికివేస్తే తమ దృష్టికి తీసుకువస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుని వారికి జరిమానాలు విదించడమే కాకుండా అవసరమైతే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ముంపు సమస్యకు త్వరలో పరిష్కారం



సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్బీనగర్: వరద ముంపు కాలనీలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని, ఇందుకు అనుగుణంగా అధికారులు వరద కాలువ నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని మల్కాజిరిగి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వినూత్ననగర్, గాంధీనగర్, అఖిలాండేశ్వరకాలనీ, స్నేహమయనగర్, పీవీఆర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి వివిధ శాఖల అధికారులతో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ శివారు ప్రాంతాలకు మౌళిక వసతులు కల్పనకు అధికారులు శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధంచేయాలని పేర్కొన్నారు. తరచూ ముంపునకు గురికావడం వలన కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి కష్టాలను తీర్చేందుకు వారికి అండగా ఉంటామని హామి ఇచ్చారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనులు చేపట్టాలి

ఏఐసీసీ కోఆర్డినేటర్ రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: వర్షాలతో కాలనీల్లో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణాన్ని వెంటనే కార్పొరేషన్ సిబ్బంది తొలగించాలని ఏఐసీసీ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి కోరారు. గురువారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్ ఎన్ఆర్ఆర్ కాలనీలో ఆయన పర్యటించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇళ్ల ఎదుట వరదనీరు చేరి అంటు వ్యాధులకు నిలయంగా మారిన సంగతి గుర్తించాలన్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, వైరల్ ఫీవర్, లాంటి రోగాలు సంభవించకుండా శానిటేషన్ పనులు చేయించేలా కమిషనర్ పి.సరస్వతితో మాట్లాడానని చెప్పారు. కార్యక్రమంలో కాలనీవాసులు రాజు, మహేందర్, జగన్, సాయిబాబా, త్రిలోకనాథ్‌రెడ్డి, ప్రశాంత్, నవీన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా కృష్ణ



వనస్థలిపురం: వర్షాకాలం, వాతావరణ మార్పు, దోమల వల్ల వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, మొదట్లోనే వ్యాధిని గుర్తిస్తే సరైన చికిత్స పొందవచ్చని వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, జనరల్ ఫిజీషియన్ డా.ఎస్.కృష్ణ అన్నారు. ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వెల్లడించారు.

- వర్షాకాలంలో మలేరియా, డయేరియా, ఫీవర్, డెంగీ, చికన్ గున్యా తదితర రోగాలు వస్తుంటాయి. ఈ సీజనులో విషజ్వరాలు, డెంగీ, ఆర్ఎస్‌వీ (రెస్పిరేటరీ సిన్సిషియల్ వైరస్) వ్యాధులు ప్రబలుతుంటాయి. డెంగీ కేసులు కూడా వస్తున్నాయి. ఆసుపత్రిలో అన్ని రకాల మందులు, ఇన్‌పేషంట్లకు కావలసిన బెడ్లు అందుబాటులో ఉన్నాయి.
- వర్షాకాలానికి ముందు రోజుకు 600–700 ఓపీ కేసులు ఉండగా ప్రస్తుతం రోజుకు 1200 నుంచి 1500 మంది వస్తున్నారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, దగ్గు. జలుబు. లూజ్ మోషన్ లక్షణాలతో వస్తున్నారు. వారిలో కొందరికి డెంగీ పాజిటివ్ వస్తోంది.
- వర్షాకాలంలో నీటి గుంతలు, ఇళ్లల్లో ఉండే కుండీలు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ బాటిళ్లు తదితర సామాగ్రిలో నిల్వ ఉండే నీటి వల్ల దోమలు వృద్ధి చెందుతాయి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. పగటి పూట కుట్టే దోమలవల్ల డెంగీ వస్తుంది. దోమలు కుట్టకుండా దోమతెరలు, చేతులు, కాళ్లు కప్పివుంచేలా దుస్తులు ధరించాలి.
- సాధ్యమైనంత వరకు నిల్వ పదార్థాలు, బయటి ఫుడ్ తీసుకోవద్దు. కాచి చల్లార్చి వడకట్టిన నీటిని మాత్రమే తాగాలి. అనవసరంగా కంగారు పడకుండా తగినంత విశ్రాంతి తీసుకోవాలి. గాబరాపడి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు వృధా చేసుకోరాదు. మంచినీరు బాగా తాగి మూత్రం సాఫీగా వచ్చేలా చూసుకోవాలి.



వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో ఓపీ కౌంటర్ వద్ద బారులు తీరిన అవుట్ పేషెంట్లు